కవితాజాలం

# నే కొన్న కల

ఆర్. దమయంతి

పల్లెలన్నీ పట్టుపూల కొమ్మలైపోయాయి
పంటలేని పొలమే లేదిక్కడ
దారులన్నీ జాతీయ రహదారుల్లా
మిలమిలమంటున్నాయి
అరుగులమీద అత్తగార్లు
కోడళ్ళ మంచితనాల్ని పొగుడుకుంటున్నారు.
ఒకప్పుడు వృద్ధాశ్రమాలుండేవని చెప్పుకుంటూ
వింత పోతున్నారు ఊరి పెద్దమనుషులు
చదువు సమాజాభివృద్ధికి అనేడిది
మొదటి పాఠంట అన్ని తరగతులవారికీ
సిలబస్‌లో నైతికశాస్త్రం తప్పనిసరి ఏ విద్యకీ
అందరూ చదువుకున్నవారే ఎవరి పన్లు వాళ్ళవే
వేలిముద్రలు లేవు
నమ్మకానికి సంతకాల పనీలేదు..
వలసల పాపాల్లేవు వలవలా దు:ఖాలూ రావు
బ్రైన్ డ్రైన్ లేదు ఒక్కడూ దేశాన్ని ఒదిలి పోడు
దానాలు తీసుకునే వాళ్ళే కరువు
దోపిళ్ళూ దౌర్జన్యాలకి సెలవు
అడవుల్లో అమాయక పక్షులు
చెట్లమీంచి ఎగరనే ఎగరవు
గన్ పేలితే నేరం
ఖాకీ దుస్తులకు పెరిగింది హోదాతనం
అర్థ రాత్రి అయినా అమ్మాయి
భద్రంగా ఇంటికొచ్చి తీరుతోంది
లేకుంటే ప్రభుత్వం సిగ్గుతో లొంచుకుంటుంది
అంతర్జాతీయ డిమాండుతో
చేనేత టీ షర్ట్స్ తెగ వుడిగేస్తోంది రాట్నాన్ని
పత్తి రైతు పడీపడీ నవ్వుతున్నాడు
డబ్బు లెక్కపెట్టుకోలేక
పెరట్లో తలాఒక పత్తిచెట్టూ నాటుకుంటున్నారు
కొలుచుకుంటూ తులసిలా..

స్వాములోర్లందరూ హిమాలయాలకెళ్ళిపోయారు
ఖాసింకి కష్టమొచ్చిందని కన్నీరౌతున్నాడు
కన్నయ్య
కులం 'కాలం' లేదు మతమేదంటే
దేశం పేరు చెబుతున్నారందరూ
ఇప్పుడిక్కడ వాలడానికి
ఈగ సైతం భయపడుతోంది
దేశ సరిహద్దుల్లో సిపాయీ
కునుకుతీసి లేస్తున్నాడు అప్పుడప్పుడు
విదేశీయులు పుణ్యక్షేత్రంగా దర్శిస్తున్నారు
నా దేశాన్నిపుట్టలుపుట్టలుగా
ఇదేమిటిక్కడ ఇన్నేసి అద్భుతాలవుతున్నాయి!?
అనంతమైన ఆనందాల తారల్లా
ఇలా ఎలా మెరుస్తున్నారు నావాళ్ళు
అమృతం తాగిన ఆనవాళ్ళతో!
ఈ నిజాన్ని కాదని రెప్పలిప్పితే నేనేం కాను?
ఎంత సొగసైన స్వప్నం కొంటున్నా
జలబంధురమైన ఈ భూమ్మీద తేలుతూ
ఈ దృశ్యాని మీరూ కనవొచ్చు
మీ సొంతమూ చేసుకోవచ్చు
ఎవరెంత గుండె పెట్టి కం(కొం)ట
అంత వెలుగుబారుతుందీ గడ్డ
పిండి కొలదీ రొట్టెలా
క(కొ)న్న కొద్దీ మనకే దక్కు ఈ కల.....

---()---